క్లుప్తంగా

అయోధ్య అక్షతలు పంపిణీ



చిలకలపల్లిలో అక్షతలు పంపిణీ చేస్తున్న భక్తులు

బలిజిపేట: చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త కె.రాంబాబు ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను గ్రామంలో భక్తులకు శనివారం పంపిణీ చేశారు. ధనుర్మాసం సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను గ్రామంలో గోవింద నామాలతో నగర సంకీర్తన చేస్తూ ఇంటింటికి పంపిణీ చేసినట్టు కె.రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా నిలిపివేత

సాలూరు: మున్సిపాలిటీలో ఆదివారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ జయరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ హెడ్ వాటర్ వర్క్స్‌లో నాలుగో నంబర్ వెల్ వద్ద 10 హెచ్‌పీ మోటార్ పాడవ్వడంతో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ



స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మాధవనాయుడు

సీతానగరం: మండలంలోని గాదెలవలస ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ మాధవనాయుడు తన ఉదారత చాటుకున్నారు. మాధవనాయుడు తాను విద్యనభ్యసించిన ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.అన్నపూర్ణమ్మ, బి.తిరుపతిరావు, వై.ప్రసాద్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఆర్.పాపినాయుడు, హెచ్‌ఎం ఎం. శంకరరావు, బి.సూర్యనారాయణ, వై.తిరుపతిరావు(తంబి) పాల్గొన్నారు.

చురుగ్గా జన్‌మాన్ సర్వే



ఆర్‌డీవలసలో సర్వే చేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: ప్రధానమంత్రి జన్‌మాన్ సర్వేను గ్రామాల్లో చురుగ్గా చేపడుతున్నారు. మండలంలోని ఆర్‌డీవలసలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో శనివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పైడితల్లి మాట్లాడుతూ..మండలంలోని పలు గ్రామాల్లో అర్హులైన 81 మందికి పీఎం జన్‌మాన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇళ్లు లేని గిరిజనులకు పక్కాగృహాలు మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.2.40 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి అర్హులైన గిరిజనులకు ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి దత్తి సురేష్‌కుమార్, తదితరులున్నారు.

నెరవేరిన పేదల సొంతింటి కల

- ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్:

పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం 17, 18 వార్డులకు చెందిన హౌసింగ్ లబ్ధిదారులకు బెలగాంలో గల సచివాలయంలో ఇళ్ల పట్టాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నర్సిపురం జగనన్న లేఅవుట్లలో స్థలాలు వచ్చిన వారికి ఆ లేఅవుట్ రద్దు కావడంతో వారికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెంకంపేట ప్రాంతంలో గల జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలను గతంలో మంజూరు చేశామన్నారు. నాడు అక్కడ ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు అందరికీ ఎమ్మెల్యే పట్టాలు చేయించి వార్డుల వారీగా వారిని గుర్తించి నేరుగా వారి వద్దకే వెళ్లి ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సమక్షంలో అందజేశారు. ఈ వ్యవహారంలో ఎటువంటి వివక్షతకు, అవినీతికి తావు లేకుండా ఎమ్మెల్యే నేరుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసి వారి జీవితాశయం నెరవేర్చారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, సచివాలయం కన్వీనర్లు జి.పద్మజ, ఎం.తవిటినాయుడు, కౌన్సిలర్ ఆర్.చిన్నంనాయుడు, గృహ సారథులు, కార్యకర్తలు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వైఎస్సార్‌సీపీలోకి ఆగని టీడీపీ వలసలు

టీడీపీలో అసమ్మతి పెరిగింది. ఫలితంగా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు ఎక్కువయ్యాయి. వైఎస్సార్‌సీపీ పార్టీలో 1వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు నడుకూరు ఎల్లయ్య, నడుకూరి దుర్గారావు, నడుకూరు నాగు, యడ్ల సుధాకర్ వారి కుటుంబ సభ్యులు శనివారం చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే జోగారావు సాదర స్వాగతం పలికారు. పార్టీలో ప్రతీ ఒక్కరికీ సముచిత గౌరవం తప్పక లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని, ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మక్కువ మండల కేంద్రంలో రెండో సచివాలయ పరిధి గంట్యాడ వీధి, కుమ్మరివీధి, దేవాంగుల వీధి, తదితర వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్నదొర, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి అమలు చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనతన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఎన్నికల వేళ ప్రజలను మరలా మోసం చేయడానికి పచ్చ పార్టీ నేతలు మోసపూరిత హామీలతో మరలా ప్రజల వద్దకు వస్తున్నారని.. వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబుల పాలన మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న మంత్రి రాజన్నదొర, తదితరులు

ఈవీఎంలపై అవగాహన



బలిజిపేట ఉన్నత పాఠశాల వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బలిజిపేట: వచ్చే ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలపై ఉన్న అనుమానాలు నివృత్తి చేసేందుకు బలిజిపేట ఉన్నత పాఠశాల వద్ద ఓటర్లకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కును ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై ఈవీఎం యంత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈవీఎం యంత్రాల్లో ఓటుకు సంబంధించిన గుర్తులను గుర్తించి ఓటు ఎలా వేయాలో సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు నిర్భయంగా వినియోగించు కోవాలని, ఓటు వజ్రాయుధం వంటిదని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన వారితో ఓటు హక్కు పొందడం, ఓటు హక్కు వినియోగం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు వేసే అధికారం రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

ఐటీఐలో స్వయం ఉపాధి శిక్షణ

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణలు ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ, డీఎస్‌డీఓ సాయికుమార్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆటోమేటివ్ సర్వీస్ టెక్నీషియన్, ఏసీ మెకానిక్ కోర్సులకు కనీస విద్యార్హత పదోతరగతి చదివి ఉండాలన్నారు. సూయింగ్ మెషిన్ ఆపరేటర్‌కు 8వ తరగతి అర్హతతో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, రెండు పాస్‌ఫోటోస్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7993795796కు ఫోన్ చేయాలన్నారు.

9న సోషల్ ఆడిట్‌పై సమీక్ష

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 9న గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ నివేదికలపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని 27 పంచాయతీల్లో వేతన రూపంలో రూ.16.01 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.2.60 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, దీనిపై ఆడిట్ బృందాలు గ్రామస్థాయిలో 17వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. తనిఖీలో గుర్తించిన అంశాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వేతనదారులు పాల్గొనాలని కోరారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని మాదలింగి పంచాయతీ మర్రిగూడ నుంచి చీడిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రూ.1.38 కోట్లతో 2.4 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గిరిజనుల సంక్షేమానికి, గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, పార్టీ జిల్లా కార్యదర్శి శెట్టి మధుసుదనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, పార్టీ ట్రెజరర్ కళింగ మల్లేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ గ్రామసభలు



గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీఓ ప్రసాద్, వికసిత్ భారత్ జిల్లా కోఆర్డినేటర్ సింహాచలం.

సీతానగరం: మండలంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వికసిత్ భారత్ గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోందని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వికసిత్ భారత్ జిల్లా కోఆర్డినేటరు రెడ్డి సింహాచలం అన్నారు. తామరకండిలో సర్పంచ్ ఎం.లక్ష్మి, కార్యదర్శి పద్మావతి ఆధ్వర్యంలో సచివాలయం వద్ద అవగాహన సదస్సు శనివారం జరిగింది. సదస్సులో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, గ్రామీణాభివృద్ధికి అవసరమైన పథకాలను వివరించారు. అలాగే గ్రామాల్లో వైద్యశిబిరాలు, వైద్య సేవలను వివరించారు. స్థానికంగానే వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, ఎంపీటీసీ సభ్యుడు వై.గౌరీశ్వరి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ సంబరం



పార్వతీపురం టౌన్ వెంకంపేట గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ పండుగలా జరుగుతోంది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.250లు పెంచి రూ.3వేలు పింఛన్ అందజేస్తుండడంతో లబ్ధిదారులు సంబర పడుతున్నారు. సంక్రాంతి పండుగ ముందే వచ్చిందంటూ సందడి చేస్తున్నారు. జగన్ బాబు ఇంటి పెద్ద కొడుకులా చూసుకుంటున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంపిణీ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సీతానగరం: మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుకు అందజేస్తున్న ఎంపీపీ బి.రవణమ్మ



సీతానగరం: లచ్చయ్యపేట సచివాలయ పరిధిలో పింఛన్ అందజేస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ

ప్రతీ కుటుంబానికి సంక్షేమ లబ్ధి

- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

భామిని:

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబు అన్నారు. మండలంలోని బత్తిలి–1 సచివాలయం పరిధిలో సర్పంచ్ టింగ శాంతికుమారి, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, కో–ఆప్షన్ సభ్యుడు విశ్వనాథ పట్నాయక్ ఆధ్వర్యంలో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వమ్మరివిల్లి రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పార్టీ నాయకులు బోడ్డెపల్లి ప్రసాద్, శివ్వాల తిరుపతి, నిమ్మన దాస్, సర్పంచ్ తోగరాన శ్రీను, ఈఓపీఆర్డీ కృష్ణారావు, వీఆర్వో మోహన్‌దాస్, కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



బత్తిలిలో సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

టీడీపీలో మూడు ముక్కలాట

- వర్గపోరుతో టీడీపీ బేజారు
- పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ కేడర్‌లో అయోమయ పరిస్థితి
- ద్వారపురెడ్డి, విజయచంద్రల మధ్య కోల్డ్ వార్
- టీడీపీ సీనియర్ నాయకుడు గర్భాపు ఉదయభాను రెబల్ అభ్యర్థిగా ప్రచారం
- పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

పార్వతీపురం టౌన్: టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మూడు ముక్కలాట కొనసాగిస్తుంది. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ వర్గం అసమ్మతి గళం వినిపించింది. కొత్త ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ఒంటెద్దు పోకడలతో అంతంతమాత్రంగానే ఉన్న పార్టీ పరిస్థితి మరింత దిగజారేలా చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకులు పేర్కొంటున్నారు. దీంతో నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు జగదీష్ వెంటే తామంతా ఉంటామని జగదీష్ మాత్రమే తమకు ఏకైక నాయకుడని ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉన్న కార్యకర్తలను విస్మరించి ఒక నియంతలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులను పూర్తిగా పక్కన పెట్టి పార్టీ కార్యక్రమాలకు సైతం పిలవకపోవడం, జిల్లా కేంద్రంలోనే రెండు వేర్వేరుగా టీడీపీ కార్యాలయాలు ఉండడం వంటివి చూసి టీడీపీ కార్యకర్తలు ఏం చేయాలో తోచక అయోమయ పరిస్థితిలో ఉన్నారు.



విజయచంద్రకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించిన టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్

సొంత పార్టీలోనే అసమ్మతి

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బోనెల విజయ్‌చంద్రకు రాజకీయ అనుభవం లేకపోవడం, తెలియని వ్యక్తులను చేరదీయడంతో సొంత పార్టీలోనే అసమ్మతి నెలకొంది. పార్టీ పెద్దల నుంచి కార్యకర్తల వరకు అవమానిస్తూ తెలుగుదేశం పార్టీ ఓటమికి కారణం అవుతున్నారని, తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో రెండు రోజుల కిందట జరిగిన నియోజకవర్గ సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి బోనెల విజయ్‌చంద్రను గెటవుట్ బోనెల అంటూ నిరసన తెలిపారు. ఇంకోవైపు ద్వారపురెడ్డి వర్గీయులు పార్టీ పరిస్థితిపై లోలోపల రగలిపోతున్నారు.

గ్రూపు రాజకీయాలు

బోనెల రాకతో తెలుగుదేశం పార్టీ మూడు ముక్కలైందని ఇటీవల ప్రారంభం చేసిన పార్టీ కార్యాలయమే ప్రత్యక్ష సాక్ష్యమని ప్రజలు, తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. గత ఎన్నికల్లో పార్టీకి ద్రోహం చేసిన వ్యక్తులను బోనెల చేరదీస్తుండడంతో ద్వారపురెడ్డి జగదీష్ ఒక వర్గమైంది. బోనెల విజయచంద్ర కొత్త నాయకులను తీసుకువచ్చి ఆయన ఒక వర్గాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు తన వర్గాన్ని ఏర్పాటు చేసి ఆయన ఒక గ్రూపును ప్రోత్సహిస్తున్నారు. ఈ గ్రూపు రాజకీయాలతో ఎవరికీ మద్దతు తెలపాలో తెలియని తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు.



గోబ్యాక్ విజయచంద్ర అంటూ నినదిస్తున్న టీడీపీ కార్యకర్తలు

రెబల్ అభ్యర్థితో తంటాలు

టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించిన గర్భాపు ఉదయభానుకు అధిష్టానం మొండి చేయి చూపడంతో పార్టీకి రాజీనామా చేయకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా తనకు టీడీపీ నమ్మించి మోసం చేసిందని టీడీపీ నుంచి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానంటూ ప్రచారం చేస్తున్నారు. అంతే కాకుండా ప్రచార రథాలతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం చేస్తూ టీడీపీకి రెబల్ పోరును తీసుకువచ్చారు.



సీతానగరం మండలంలో వెలసిన రెబల్ అభ్యర్థి పోస్టర్లు

టీడీపీకి గుడ్‌బై చెబుతున్న కార్యకర్తలు

తెలుగుదేశం పార్టీ పరిస్థితి సరిగా లేకపోవడంతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న పలువురు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. పార్వతీపురం పట్టణానికి చెందిన తెలుగు యువత అధ్యక్షుడు చందక దేశాలు గత రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్వతీపురం పట్టణం జగన్నాథపురం కాలనీకి చెందిన 40 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. మరోవైపు పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.